క్లుప్తంగా

ముఖ్యమంత్రిని కలిసిన వీసీ భారతి


ముఖ్యమంత్రితో వీసీ భారతి

తిరుపతి ఎడ్యుకేషన్: తిరుపతి శ్రీపద్మావతి మహిళా వర్సిటీ వీసీ ప్రొఫెసర్ డి.భారతి గురువారం తాడేపల్లె క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. వీసీగా బాధ్యతలు అప్పగించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వర్సిటీలోని కోర్సులు, ఇతర వివరాలను ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు.

సీఎం పర్యటన ఏర్పాట్లపై సమీక్ష

తిరుపతి అర్బన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నెల 21వ తేదీన జిల్లా పర్యటనకు రానున్న నేపథ్యంలో ఏర్పాట్లపై శుక్రవారం రాత్రి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటరమణారెడ్డి సమీక్షించారు. సీఎం పర్యటన విధులు కేటాయించబడిన అధికారులకు దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో డీఆర్‌ఓ కోదండరామిరెడ్డి, ఎస్డీసీ భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

పారదర్శకంగా భూసర్వే

రామచంద్రాపురం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీసర్వేను పారదర్శకంగా పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశించారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్వోలు, సర్వేయర్లతో సమావేశం నిర్వహించారు. జేసీ మాట్లాడుతూ భూ రీసర్వే పనులను వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఆర్ఐ కృష్ణమ్మ, వీఆర్‌ఓలు సతీష్, ప్రసాద్, విజయ్‌భాస్కర్, శ్రీనివాసులు, సర్వేయర్ హేమంత్‌కుమార్ పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి


మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

ఎర్రావారిపాళెం(భాకరాపేట): సేంద్రియ ఎరువులతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య తెలిపారు. శుక్రవారం మండలంలోని ఉదయమాణిక్యంలో నిర్వహించిన రైతు శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సేంద్రియ ఎరువులు నేలను మృదువుగా చేస్తాయన్నారు. చీడ పీడల బెడద తగ్గి, నాణ్యమైన పంట వస్తుందని వెల్లడించారు. వ్యవసాయశాఖ అధికారులు వేణుగోపాల్‌రావు, ఖాదర్‌బాషా పాల్గొన్నారు.

ఆదర్శవంతంగా 'సంక్షేమం'

- జగనన్న చేసిన మేలే మళ్లీ గెలిపిస్తుంది
- ఓటమి భయంతోనే ప్రతిపక్షాల విమర్శలు
- గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే భూమన


లబ్ధిదారుకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి, పక్కన మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ

తిరుపతి మంగళం: దేశంలో ఎక్కడా లేని విధంగా.. ఆదర్శవంతంగా సంక్షేమ పథకాలను ముఖ్యమంత్రి వైఎస్‌జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్నారని ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి కొనియాడారు. శుక్రవారం తిరుపతిలోని 6వ డివిజన్ సుబ్బారెడ్డినగర్‌లో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వంలో ఆయన పాల్గొన్నారు. మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, కార్పొరేటర్ కేతం జానకి, టౌన్‌బ్యాంక్ చైర్మన్ కేతం జయచంద్రారెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. సంక్షేమ బావుటా బుక్‌లెట్ పంపిణీ చేశారు. స్థానిక సమస్యలను అడిగి తెలుసుకుని అక్కడికక్కడే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మాట్లాడుతూ చంద్రబాబు అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేశారని, అందుకే 2019 ఎన్నికల్లో ఓటుతో తగిన బుద్ధి చెప్పారన్నారు. అయినప్పటికీ చంద్రబాబులో మార్పు రాలేదని మళ్లీ మాయమాటలు చెబుతున్నారని మండిపడ్డారు. చంద్రబాబు తన పాలనతో ప్రజలకు చిన్నపాటి మేలు కూడా చేయలేదని విమర్శించారు. నాలుగేళ్ల పాలనలోనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీల్లో 99శాతం నెరవేర్చారని వెల్లడించారు. అందుకే ప్రతి పేదవాడు తన గుండెల్లో జగనన్నను కొలువుదీర్చుకున్నారన్నారు. జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను దేశ రాజకీయాలే ఆదర్శంగా తీసుకుంటున్నాయని చెప్పారు. సంక్షేమ ప్రదాత జగనన్నను రాబోయే ఎన్నికల్లో కూడా ఓడించలేమనే భయంతోనే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ విమర్శలు గుప్పిస్తున్నారని, ఎల్లో మీడియాలో పిచ్చి రాతలు రాయిస్తున్నారని ఆరోపించారు. ఎవరు ఎన్ని చెప్పినా ప్రజలకు నమ్మే పరిస్థితి లేదని, జగనన్న వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. చంద్రబాబు, పవన్ నోటికొచ్చినట్లు మాట్లాడితే టీడీపీ, జనసేనని ప్రజలే భూస్థాపితం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుల్లూరు అమరనాథ్‌రెడ్డి, టి.మునిరామిరెడ్డి, రామస్వామి వెంకటేశ్వర్లు, కో–ఆప్షన్ సభ్యులు శ్రీదేవి, పార్టీ 7వ డివిజన్ అధ్యక్షుడు చిమట రమేష్, 6వ డివిజన్ అధ్యక్షుడు నాధమునిరెడ్డి, బాలాజీ, టౌన్‌బ్యాంక్ డైరెక్టర్ ఖాసీం (చోటాభాయ్), వెంకటేష్, నేతలు పాముల రమేష్‌రెడ్డి, తలారి రాజేంద్ర, తాలూరి ప్రసాద్, కంకణాల రమేష్, నాధముని, శ్యామల, గీతాయాదవ్ పాల్గొన్నారు.

ప్రజాసాధికారతే ప్రభుత్వ లక్ష్యం


మాట్లాడుతున్న చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి

తిరుపతి రూరల్: ప్రజాసాధికారతే ప్రభుత్వ లక్ష్యమని, అందుకే విప్లవాత్మకంగా సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం తిరుపతి రూరల్ మండలం చెర్లోపల్లె, తిరుచానూరు (లక్ష్మీనగర్) సచివాలయ పరిధిలో నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. చెర్లోపల్లిలో పంచాయతీలో అర్హులైన 443 మందికి, లక్ష్మీనగర్ సచివాలయం పరిధిలో 211 మందికి మొత్తం 654 సేవలకు సంబంధించి సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ దేశరాజకీయాల్లో సంక్షేమ సారథిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కీర్తించబడుతున్నారని కొనియాడారు. జగనన్న సురక్ష ద్వారా ప్రతి కుటుంబానికి అవసరమైన ఆదాయ, కుల తదితర 11 రకాల అప్లికేషన్లను ఉచితంగా అందజేస్తున్నట్లు వెల్లడించారు. కులం, మతం, పార్టీలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలకు అర్హత ప్రామాణికంగా ప్రభుత్వ పథకాలను మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ప్రతి ఇల్లు, ప్రతి పంచాయతీ అభివృద్ధే లక్ష్యంగా పథకాలు అమలు చేస్తున్నామని వివరించారు. ఇప్పటికీ లబ్ధిపొందని అర్హులను వెతికి మరీ ప్రభుత్వ పథకాలు మంజూరు చేసేందుకు జగనన్న సురక్ష కార్యక్రమాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ వేముల యశోద, సర్పంచ్ సుభాషిణి, శుభ గిరినాయుడు, ఎంపీటీసీ సభ్యులు శివశంకర్, నరేష్, దొరస్వామి పాల్గొన్నారు.

గడప గడపలో ఆత్మీయ స్వాగతం


మహిళతో మాట్లాడుతున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి మంగళం: స్థానిక తిరుమలనగర్ పంచాయతీలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సతీమణి లక్ష్మి శుక్రవారం గడప గడపకు ఆత్మీయ పలకరింపు కార్యక్రమంలో భాగంగా పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో చేసిన అభివృద్ధి పనులను వివరించారు. చేయాల్సిన పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా చెవిరెడ్డి లక్ష్మికి స్థానికులు ఆత్మీయ స్వాగతం పలికారు. తుడా క్వార్టర్స్, కేబీఆర్ నగర్, రామచంద్రానగర్, గంగాదేవి ఎస్టీ కాలనీల్లో పర్యటనకు విచ్చేసిన ఆమెకు మహిళలు నీరాజనలు పట్టారు. చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఎమ్మెల్యేగా కాకుండా అన్నగా.. బిడ్డగా.. మాలో ఒకడిగా ఉంటూ అందించిన సేవలను జీవితాంతం మరువలేమని కొనియాడారు. ముఖ్యంగా కోవిడ్ కష్టాల్లో ప్రాణాలను ఫణంగా పెట్టి నేనున్నానంటూ ధైర్యం చెప్పారని గుర్తుచేసుకున్నారు. లక్ష్మి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తున్నారని, ఎమ్మెల్యే చెవిరెడ్డి నిత్యం ప్రజాసేవే పరమావధిగా విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు. తమ బిడ్డ మోహిత్‌రెడ్డిని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. మాజీ ఎంపీపీ మునికృష్ణ, పార్టీ రూరల్ డివిజన్ అధ్యక్షుడు నారాయణ రెడ్డి, తిరుమలనగర్ అధ్యక్షుడు శివశంకర్‌రాజు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ లక్ష్మీదేవి పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీకి విద్యార్థుల ఎంపిక


సి.శ్రావణి


కె.చానమా


బి.రిషితా సునంద

తిరుపతి ఎడ్యుకేషన్: స్థానిక చిన్నబజారు వీధిలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినులు సి.శ్రావణి, కె.చానమా, బి.రిషితా సునంద ఇడుపులపాయలోని ట్రిపుల్ ఐటీలో ప్రవేశం పొందారు. వీరు మండల, నియోజకవర్గ స్థాయిలో జగనన్న ఆణిముత్యాల కింద అవార్డులు అందుకున్నారు. తమ విద్యార్థినులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించడం గర్వకారణమని పాఠశాల ప్రధానోపాధ్యాయని తెలిపారు.

స్వచ్ఛభారత్ మండల కన్వీనర్‌గా గిరిబాబు



భాకరాపేట: స్వచ్ఛభారత్ చిన్నగొట్టిగల్లు మండల కన్వీనర్‌గా గిరిబాబును నియమిస్తూ చిత్తూరు జిల్లా కలెక్టర్ సగిలి షణ్మోహన్ ఉత్తర్వులు జారీ చేశారు. శుక్రవారం ఈ మేరకు చిన్నగొట్టిగల్లు ఎంపీడీఓ దేవేంద్రబాబుకు గిరిబాబు ఉత్తర్వులను అందజేసి బాధ్యతలు స్వీకరించారు.

వైఎస్సార్‌సీపీ పంచాయతీ అధ్యక్షుల నియామకం

చంద్రగిరి(తిరుపతి రూరల్): చంద్రగిరి మండలంలోని పంచాయతీలకు సంబంధించి వైఎస్సార్‌సీపీ అధ్యక్షులను నియమిస్తూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. చంద్రశేఖర్‌రెడ్డి(చంద్రగిరి), కిషోర్(ఐతేపల్లి), శ్రీకాంత్(కొండ్రెడ్డికండ్రిగ), ప్రసాద్(కొటాల), కృష్ణమూర్తినాయుడు(కందులవారిపల్లి), రాజశేఖర్‌రెడ్డి(భీమవరం), అచ్యుత(గంగుడుపల్లి), మునికృష్ణారెడ్డి(మామండూరు), వెంకటేశ్వర్లు(బుచ్చినాయుడుపల్లి), రెడ్డెప్ప(ఎం.కొంగరవారిపల్లి), నాగరాజు(పులిత్తివారిపల్లి), బుజంగరావు(రామిరెడ్డిగారిపల్లి), ఔరంగజేబు(రెడ్డివారిపల్లి), మహేష్(కాసిపెంట్ల), ప్రవీణ్(ఏజీపల్లి), హరి(రాయలపురం), బుల్లెబ్బనాయుడు(పుల్లయ్యగారిపల్లి) నియమిస్తున్నట్లు పేర్కొన్నారు. పంచాయతీల అధ్యక్షులను పార్టీ మండల అధ్యక్షుడు కొటాల చంద్రశేఖర్‌రెడ్డి అభినందించారు.

నేటితో ముగియనున్న కిష్కింధకాండ పారాయణం

తిరుమల: తిరుమల వసంత మండపంలో సాగుతున్న షోడశదిన కిష్కింధ కాండ పారాయణ దీక్ష శనివారంతో ముగియనుంది. ×మారుతస్య సమోవేగే గరుడస్య సమోజవేॐ అనే శ్లోకంలో చివరి అక్షరానికి సూచికగా చివరిరోజు 4 సర్గలను పండితులు పారాయణం చేయనున్నారు. ధర్మగిరి వేద విజ్ఞానపీఠం ప్రిన్సిపల్ కేఎస్ఎస్ అవధాని ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరుగుతున్నాయి.

శ్రీవారి సేవలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి

తిరుమల: తిరుమల శ్రీవారిని శుక్రవారం అభిషేక సమయంలో కర్ణాటక హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శివశంకర్ దర్శించుకున్నారు. శ్రీవారి దర్శనానంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వదించారు. అధికారులు లడ్డూ ప్రసాదాలు అందజేశారు. అలాగే తమిళనాడు మంత్రి మతివేతన్, 14 రాష్ట్రాల ఐఎఫ్ఎస్ అధికారులు దర్శించుకున్నారు.

బంగారు తిరుచ్చిపై మురళీకృష్ణుడు


ఊరేగుతున్న స్వామివారు

చంద్రగిరి(తిరుపతి రూరల్): శ్రీనివాస మంగాపురంలోని కల్యాణవేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి అలంకరణలో మలయప్పస్వామి వారు శుక్రవారం దర్శనమిచ్చారు. బంగారు తిరుచ్చిపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో భక్తులను కటాక్షించారు. ప్రత్యేక శ్రేణి డిప్యూటీ ఈఓ వరలక్ష్మి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నేత మృతికి నివాళి

పాకాల(తిరుపతి రూరల్): పాకాల మండలం దామలచెరువు వైఎస్సార్‌సీపీ నేత అహ్మద్ బాషా(49) శుక్రవారం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న చంద్రగిరి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్ రెడ్డి దామలచెరువుకు చేరుకుని అహ్మద్ బాషా పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఆస్తి రాయించుకుని గెంటేశాడు!

తిరుపతి కల్చరల్: తాతయ్యగుంట వీధిలోని ఇంటిని తన కుమారుడు రాజశేఖర్ బలవంతంగా రాయించుకుని బయటకు గెంటేశాడని తల్లి శకుంతమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఆమె విలేకర్లతో మాట్లాడారు. తల్లిననే ఆలోచన కూడా లేకుండా ఆస్తి కోసం నిందారోపణలు చేస్తూ తనతో పాటు కుమార్తెను వీధులపాలు చేశాడని వాపోయారు. అధికారులు స్పందించి ఇంటిలో తమకు న్యాయం జరిగేలా చేయాలని విజ్ఞప్తి చేశారు.

వేడుకగా 'శ్రీఆండాళ్ తిరువడిపురం'


తిరుచ్చిపై అమ్మవారు

తిరుపతి కల్చరల్: గోవిందరాజస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీఆండాళ్ అమ్మవారి తిరువడిపురం ఉత్సవాన్ని వేడుకగా నిర్వహించారు.ఈనెల 22వ తేదీ వరకు అత్యంత వైభవంగా ఉత్సవం కొనసాగనుంది. అందులో భాగంగా రెండోరోజు ఉదయం శ్రీఆండాళ్ అమ్మవారికి తిరుమంజనం చేపట్టి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారిని గాంధీ రోడ్డులోని గంగుండ్ర మండపానికి వేంచేపు చేసి ఆస్థానం చేపట్టారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈఓ శాంతి, ఏఈఓ రవికుమార్‌రెడ్డి, సూపరింటెండెంట్లు నారాయణ, మోహన్‌రావు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు రాధాకృష్ణ, ధనంజయులు పాల్గొన్నారు.

కియా సెల్‌టాస్ రీబోర్న్ కారు ఆవిష్కరణ


కారును ఆవిష్కరిస్తున్న ఎండీ జగన్నాథరెడ్డి తదితరులు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు సమీపంలోని హోషిఆటో ప్రైవేట్ లిమిటెడ్ కియా కార్ షోరూంలో శుక్రవారం ×కియా సెల్టాస్ రీబోర్న్ కారు ఆవిష్కరించారు. కార్యక్రమంలో మేనేజింగ్ డైరెక్టర్ సి.జగన్నాథరెడ్డి, డైరెక్టర్ చెరకు నిరంజన్, సి.భారతి, సి. హోషిమా రెడ్డి, అషీష్ రెడ్డి, చెలికం రాజశేఖర్ రెడ్డి, భూమన సుబ్రమణ్యంరెడ్డి, డాక్టర్ వెంగమ్మ పాల్గొన్నారు. ఎండీ జగన్నాథరెడ్డి మాట్లాడుతూ కియా నుంచి వచ్చిన సెల్‌టాస్ ఎస్‌యూవీ కారులో అధునాతనమైన ఎక్స్‌టీరియర్, ఇంటీరియర్‌లలో అనేక ఆధునిక మార్పులు చేయడంతోపాటు ఫేస్‌లిఫ్టెడ్ కియా సెల్టోస్ ఎస్‌యూవీ పెద్ద గ్రిల్, ఎయిర్ డ్యామ్ తగ్గింపుతో ఇవ్వడం జరిగిందన్నారు. 17 అంగుళాల అల్లాయ్ వీల్స్, 6 ఎయిర్ బ్యాగులతో కియా కంపెనీ ఏఎస్ఎంఎస్. వంశీ, షోరూం జనరల్ మేనేజర్ ఎం.సతీష్ బాబు, మేనేజర్ ఇ. సోమనాథ్ లాల్ పాల్గొన్నారు. ఈ కారు బుకింగ్ కోసం 8688829739 నంబరును సంప్రదించాలని కోరారు.

ఫ్రీహెల్త్ చెకప్‌కు విశేష స్పందన


వైద్య పరీక్షలు చేయించుకుంటున్న హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: మండలంలోని కమ్మకండ్రిగ, నెన్నూరు, నడవలూరులో శుక్రవారం నిర్వహించిన ఉచిత హెల్త్ చెకప్‌ను చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో దేశంలో ఎక్కడా లేని విధంగా నియోజకవర్గంలోని ప్రజలందరికీ వైద్యపరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. ఈసీజీ, షుగరు, బీపీ, కిడ్నీ, లివర్, థైరాయిడ్, కొలెస్ట్రాల్ వంటి 43 రకాల టెస్టులను ఉచితంగా చేస్తున్నట్లు వివరించారు. కార్యక్రమంలో ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, కమ్మపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి హేమలత, సర్పంచులు వేణు, గణపతిరెడ్డి, డివిజన్ అధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, బాబుయాదవ్, వైఎస్సార్‌సీపీ నాయకులు సిద్ధమునిరెడ్డి, ఈశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

దాడిలో ఒకరికి గాయాలు

తిరుచానూరు(చంద్రగిరి): తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి దర్శనార్థం వచ్చిన భక్తుడిపై తిరుపతికి చెందిన మరో భక్తుడు శుక్రవారం దాడికి పాల్పడ్డాడు. వివరాలు.. కేరళకు చెందిన మనీష్ తన కుటుంబ సభ్యులతో కలసి కారులో అమ్మవారి ఆలయం వద్దకు వస్తున్నాడు. తిరుపతి పార్లవీధికి చెందిన నటరాజ్ ఆస్థాన మండపం వద్ద ముందు కారులో వెళుతున్నాడు. వెనుక నుంచి మనీష్ కారు హారన్ వేయడంతో ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. నటరాజ్ దాడి చేయడంతో మనీష్ తీవ్రంగ గాయపడి అపస్మారక స్థితిలోకి చేరుకున్నారు. కుటుంబ సభ్యులు మనీష్‌ను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. టీటీడీ విజిలెన్స్ అధికారులు నటరాజ్‌ను అదుపులోకి తీసుకుని పోలీసులకు అప్పగించారు.

ఆదర్శం.. వివేకానందుని జీవితం


నిర్వాహకులతో విద్యార్థులు

తిరుపతి ఎడ్యుకేషన్: యువతకు వివేకానందులు ఆదర్శనీయులని ఎస్వీ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ గంగాధర తెలిపారు. శుక్రవారం గిరిజన నవ సమాజ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో స్వామి వివేకానంద సమగ్ర జీవిత చరిత్ర పార్ట్–1, పార్ట్–2 పుస్తకాలను 200 మంది విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ప్రిన్సిపల మాట్లాడుతూ హిందూ సనాతన ధర్మం విశిష్టతను స్వామి వివేకానంద జీవిత చరిత్రలో పేర్కొన్నారన్నారు. కార్యక్రమంలో ఎస్వీడీఏ కళాశాల ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, గిరిజన నవ సమాజ వ్యవస్థాక అధ్యక్షుడు శివశంకర్‌నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్‌నాయక్ పాల్గొన్నారు.